క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన కొలుముల పల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయం ఎదుట భక్తులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించే కల్యాణ మండపం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు అనంతరం భూమిపూజ గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హుసేన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రఘురామిరెడ్డి, రామస్వామి, రామాంజనేయులు, గూని నాగరాజు, వెంకటేశ్వర్లు, ధనుంజయుడు, భజనకృష్ణయ్య, నాగ మోహన్, బూషిరెడ్డి పాల్గొన్నారు.

గొర్విమానుపల్లె పంచాయతీకి వీధిలైట్లు అందజేత



వీధిలైట్లు అందజేస్తున్న అల్ట్రాటెక్ ప్రతినిధులు

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో గొర్విమానుపల్లె గ్రామ పంచాయితీకి శుక్రవారం వంద వీధిలైట్లను ఆ కంపెనీ ప్రతినిధులు ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డికి అందజేశారు. గొర్విమానుపల్లెతో పాటు మజారా గ్రామమైన కొండమీదపల్లెలో వీధిలైట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రజల సౌకర్యార్థం కంపెనీ సామాజిక బాధ్యత కింద వీధిలైట్లు అందజేసినట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పులి సుదర్శన్‌రెడ్డి, ఆవుల దస్తగిరి, చాకలి రమేష్, ఆవుల చంద్రమోహన్, మహేష్, బోయలాలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అవుకు: మండల కేంద్రం అవుకు బస్టాండ్ సమీపాన నివాసం ఉంటున్న వరిసెల జయరాముడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక బలిజ సంఘం పెద్దలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమవంతుగా ఆర్థిక సాయం చేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు వేటూరి రమణ, జక్కా మధు, మామిళ్ల సుబ్బన్న, వరప్రసాద్, గుర్రాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

కొలిమిగుండ్ల: స్థానిక పెట్నికోట రోడ్డులోని అక్కదేవతల గుడి సమీపంలో శుక్రవారం 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. బెలుం శింగవరానికి చెందిన చాకలి రమణ, అవుకు మండలం కొండమనాయినపల్లెకు చెందిన బోయ చిన్న పెద్దరాజు నాటు సారా ప్యాకెట్లు తీసుకెళ్తుండగా సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డాక్టర్ల నియామకం

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లెకు కొత్తగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కి ప్రభుత్వం ఇద్దరు డాక్టర్ల నియామకం జరిగిందని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం వారు కొలిమిగుండ్ల పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోవెలకుంట్ల నుంచి వినోద్‌కుమార్, అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి నాగార్జున డాక్టర్లు వచ్చారన్నారు. అంకిరెడ్డిపల్లె సమీపంలోని తుమ్మలపెంట సాయి బాబా గుడికి ఎదురుగా పీహెచ్‌సీ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. ఇటీవలనే టెండర్ ప్రక్రియ ముగిసిందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ముందుగానే ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించిందన్నారు.

కూల్‌డ్రింక్ షాపులో షార్ట్ సర్క్యూట్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్లలో శుక్రవారం తెల్లవారు జామున కూల్‌డ్రింక్స్, ఎలక్ట్రికల్ షాపులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి వస్తువులు కాలిపోయాయి. గ్రామానికి చెందిన యూనస్ బాషా కూల్‌డ్రింక్స్, ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ఫ్రిజ్‌లు, ప్రింటర్, ఎలక్ట్రికల్ సామగ్రి కాలి బూడిదయ్యాయి. దాదాపురు రూ.4లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామ సమీపంలో శుక్రవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో దాడి చేశామన్నారు. రూ. 18,590, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ శాశ్వత భవనాలు

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఎంపిపి నూతన భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన

డోన్ : మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ నూతన భవనాలను నిర్మిస్తామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రూ.1.50కోట్లతో నిర్మించ తలపెట్టిన మండల ప్రజాపరిషత్ నూతన భవన నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఆర్డీఓ వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతం ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించామని, మిగిలిన 10 శాతానికి సంబంధించి త్వరలోనే సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీసమూన్, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు బొబ్బల శివరామిరెడ్డి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్ఎస్ఈ సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ సీఈఓ నాసరారెడ్డి, ఈఈ రామకృష్ణారెడ్డి, ఏఈ మహేష్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఎంపీటీసీ సభ్యులు సుభద్ర, మహేశ్వరమ్మ, మదనగోపాల్, సుధాకర్, రామలక్ష్మమ్మ, సువర్ణ, జానకిరాముడు, సునిత, పార్వతమ్మ, సుమిత్రమ్మ, లక్ష్మినారాయణ, కామాక్షమ్మ, జయమ్మ, పెద్ద ఓబులేసు, నీలమ్మ, రామలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు హుసేన్‌లు పాల్గొన్నారు.

మంత్రికి ప్రభుత్వ ఉద్యోగుల వినతి

డోన్: మూడవ దశ ఉద్యమకార్యచరణలో భాగంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ప్రతి నిధులు శుక్రవారం డోన్‌లోని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలను నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నంద్యాల జిల్లా అధక్షుడు రామచంద్రరావు, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేశ్వర రెడ్డి, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు శేఖర్ డోన్ తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ జాకీర్‌హుస్సేన్, సంఘం నాయకులు ఉపేంద్ర,శేక్షావలి, వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బుగ్గన ప్యాపిలిలో పర్యటన

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ప్యాపిలి మండలంలో పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 1.5 కోట్లతో నిర్మించిన గోపాలనగరం- ఊటకొండ రోడ్డును మంత్రి ప్రారంభించి అదే రోడ్డుపై పాద యాత్ర చేస్తారని తెలిపారు. అనంతరం కొత్తగా నిర్మించనున్న జలదుర్గం–డోన్ ఆర్అండ్‌బీ రోడ్డుకు మంత్రి భూమి పూజ చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం ప్యాపిలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మంత్రి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపిలోకి చేరిన గుమ్మకొండ గ్రామస్తులు

డోన్: మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 15కుటుంబాల శుక్రవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ గ్రామ నాయకులు సుధాకర్‌రెడ్డి, చిన్నహనుమన్న నాయకత్వంలో తలారి హరి, దేవ, రమేష్, సూరి, చత్రపతి, తిరుమలేషు, పవన్, మాసూంవలి, విజయ్, ఆంజనేయులు, సూర్యప్రతాప్, ఉప్పరి బజారి, గంగాధర్, నారాయణ, కృష్ణయ్య తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదారంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైమై పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

4 నుంచి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు

బనగానపల్లెరూరల్: మండలంలోని జ్వాలాపురం గ్రామంలో దాతల సహకారంతో దాదాపు రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీ మారెమ్మ, కుంటమ్మ, పోతురాజు ఆలయం పూర్తయిందని గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని పునర్నిర్మించామన్నారు. జూన్ 4 నుంచి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

పేదలకు మరింత చేరువగా వైద్యం



తండాలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినోద్ కుమార్

అవుకు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేద ప్రజలకు వైద్యం మరింత చేరువ అయ్యిందని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జూనూతల పిక్కళ్లపల్లి తండా గ్రామాల్లో దీర్ఘకాలిక రోగుల ఇంటి వద్దకేవెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం సాధారణ వ్యాధులకు సంబంధించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రక్తపోటు, డయాబెటీస్, క్యాన్సర్, గుండెకు వ్యాధులు, గణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, మంచానికి పరిమితమైన వారికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు కమాల్ సాహెబ్, దానమ్మ, ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు సముచిత స్థానం

- 130 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి బుగ్గన

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసులో నాయీబ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం ఉందని, అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గుర్తు చేశారు. పట్టణానికి చెందిన 130 నిరుపేద నాయీబ్రాహ్మణుల కుటుంబాలకు శుక్రవారం మంత్రి తన స్వగృహంలో మంత్రి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయాల్లో పలు రకాల సేవలు అందించే నాయీబ్రాహ్మణులకు పాలక మండళ్లలో సైతం చోటు కల్పించారన్నారు. ఏటా నాయీ బ్రాహ్మణులకు రు.10వేల ఆర్థిక సాయంతోపాటు వారు నిర్వహించే సెలూన్లకు విద్యుత్ రాయితీలను అందించే విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

మంత్రికి సత్కారం: అర్హులైన తమకు అడిగిన వెంటనే ఇంటి స్థలాలను మంజూరు చేసిన మంత్రి బుగ్గనతో పాటు ఇందుకు సహకరించిన మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, తహసీల్దార్ విద్యాసాగర్‌ను నాయీ బ్రాహ్మణులు ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి బుగ్గన

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికీ పల్లకిసేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ సేవా కార్యక్రమాన్ని సంప్రదాబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు

- మినీ బస్సు సీజ్.. 55 వేలు జరిమానా
- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్



వాహనాన్ని పరిశీలిస్తున్న క్రాంతి కుమార్

డోన్ టౌన్: వాహనచోదకులు, యాజమాన్యాలు రోడ్డు నిబంధనలు పాటించుకుంటే చర్యలు తప్పవని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ హెచ్చరించారు. జాతీయ రహదారిలోని టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఆయన తనిఖీ చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన మినీ బస్సు తనిఖీ చేశారు. వాహనానికి ఎల్లో నంబర్ ప్లేట్‌కు బదులుగా వైట్ నేమ్ ప్లేట్ ఉండడంతో ఛాయిస్ నంబర్‌ను పరిశీలించారు. తప్పుడు నంబర్‌గా గుర్తించిన ఆయన ఆ వాహనాన్ని సీజ్ చేసి రూ. 55వేల జరిమానా విధించామని తెలిపారు. టాక్స్‌లు కట్టకుండ తిరిగే వాహనాలకు భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



వలంటీర్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

సంజామల: ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మండల ఉపాధ్యక్షుడు చిన బాబు పేర్కొన్నారు. శుక్రవారం పేరుసోముల సచివాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం అందించే పథకాలు ప్రజల ముంగిటకు చేర్చడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శృతి, పంచాయితీ కార్యదర్శి విక్రం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభకు వివరించారు. పదో తరగతి పరీక్షల్లో దారుణమైన ఫలితాలు వచ్చాయని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధ్యాయుల కొరత లేక పోయినా ఎందుకు ఫలితాలు సరిగా రాలేదని, ఎక్కడ లోపం ఉందని ప్రశ్నించారు. గొర్విమానుపల్లెలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిర్వాకం మూలంగా గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతుందని ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. అన్ని చోట్లా కొత్తగా నిర్మిస్తున్న సచివాలయాలకు బిల్లులు మంజూరు అవుతున్నా గ్రామంలో నిర్మిస్తున్న భవనానికి ఎందుకు మంజూరు కావడం లేదన్నారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, ఈఓఆర్డీ తాహీర్ హుశేన్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు సుబ్రహ్మణ్యం, అన్వర్ హుశేన్, మద్దిలేటి, ఎంఈఓ జిలానీ బాషా, పశువైద్యాధికారిణి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్ఆర్ ట్యాంక్ ప్రారంభానికి సిద్ధం

బనగానపల్లెరూరల్: మండలంలోని బీరవోలు గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.31 లక్షలతో చేపట్టిన ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యింది. తాగునీటి సమస్య శాశ్వత పరిస్కారంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఓహెచ్ఆర్ నిర్మాణానికి ప్రత్యేకంగా రూ. 31లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యింది. జల్‌జీవన్ పథకంతో గ్రామంలో ఇప్పటికే ఇంటింటికి సురక్షితమైన త్రాగునీటి సరఫరా అందించాలనే ఉద్దేశంతో ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేశారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుండడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఓహెచ్ఆర్ ట్యాంకును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ తెలిపారు.



బీరవోలులో రూ.31లక్షలతో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకు

ప్రజాసేవే పరమావధిగా వలంటీర్ వ్యవస్థ



వలంటీర్లను సన్మానించిన ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వార్డు కౌన్సిలర్లు

బేతంచెర్ల: ప్రజా సేవే పరమావధిగా వలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలందరి మన్ననలు పొందడం అభినందనీయమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్ పేర్కొన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాల కార్యక్రమం శ్రీనగర్ కాలనీల్లోని షాదిఖానాలో నిర్వహించారు. ఈసందర్భంగా పారుఖ్ పాషాకు సేవావజ్ర పురస్కారం, పుష్పలత, విజయలక్ష్మి, లక్ష్మిదేవి, నడ్డి సురేఖ, మంజువాణికి సేవా రత్న, 165 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీ పై ఉంచిన నమ్మకాని వమ్ముచేయకుండా మీ పరిధిలోని యాభై కుటుంబాలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. ప్రజల వద్దకు పాలనలో భాగంగా మహాత్ముడి కలలను సాకారం చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. వివక్ష, లంచం, అవినీతి తావు లేకుండా పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేసి రానున్న రోజుల్లో ప్రజలే మిమ్మల్ని సన్మానించేలా సేవలందించేలా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు, కో ఆప్షన్ సభ్యురాలు అబీదా, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, సలీమ్, ఖాజా, బుగ్గన భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవుకు: మండల కేంద్రం అవుకులోని పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో (ఐటీఐ) ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం ప్రారంభమైందని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం తెలిపారు. కంప్యూటర్, వెల్డర్, మెకానిక్ డీజిల్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ట్రేడ్‌ల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీ లోపు iti.ap.gov.in వెబ్ సైట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


సన్మానం

కోవెలకుంట్ల: ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) డైరెక్టర్‌గా ఎంపికైన మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన కరుణాకర్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. బిజనవేముల గ్రామానికి చెందిన పోలీస్ బ్రదర్స్ ఓబులేసు, బాలఓబులేసు, నాగన్న, చిన్న ఓబులేసు ఆధ్వర్యంలో ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్వామిదాసు, బాలనరసింహ, రాందాసు, హుసన్, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

కోవెలకుంట్ల: స్థానిక వీఆర్, ఎన్ఆర్ పంక్షన్ హాల్‌లో మండలంలో పురస్కారాలకు ఎంపికైన గ్రామ వలంటీర్లకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సంబంధించి 278 మంది వలంటీర్లు ఉండగా ఇద్దరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, మిగిలిన వారికి సేవామిత్ర పుష్కారాలు దక్కాయన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో పురష్కారాలకు ఎంపికైన వలంటీర్లను ఘనంగా సత్కరిస్తామన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



క్రైస్తవ సోదరులకు సందేశం ఇస్తున్న పాస్టర్లు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో సీఎస్ఐ చర్చి మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల, పేరుసోముల, శింగనపల్లె సీఎస్ఐ చర్చి పాస్టర్లు వినయ్ కుమార్, విల్సన్‌బాబు, అరుణ్‌బాబు, జెకరయ్య ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలిపిన ముస్లింలు



మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్‌ను సత్కరిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

బేతంచెర్ల: రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యులుగా ఎన్నికైన మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్‌గా ఎన్నికైన ఖాజా హుసేన్ పట్టణ ముస్లిం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితోపాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. మంత్రి బుగ్గన చొరవతో తమకు పదవులు వచ్చాయని, ఆయన సాయం మరువమని మూర్తుజావలీ, ఖాజా హుసేన్ తెలిపారు. కార్యక్రమంలో మండల ఖాజీ నూర్ అహ్మద్, ముస్లిం నాయకులు దస్తగిరి, ఖాజా, సయ్యద్, వలీబాషా, సలీమ్, ఫిరోజ్, సంథానీ, చాంద్, మహబూబ్, పిట్టల జాకీర్, మహబూబ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న మోడీ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే అజెండాగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పని చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఆ పార్టీ సమర భేరిలో యాత్రలో భాగంగా శుక్రవారం సాయిత్రం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో అధికారం లోకి వచ్చిన మోడీ ఏమి అభివృద్ధి చేసారని ప్రశ్నించారు. సీబీఐని తన గుప్పిట్లో పెట్టుకుని కేంద్రాన్ని విమర్శించిన నేతలపై కేసులు బనాయించడం, అరెస్టులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి కార్పొరేట శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. 2014నాటి ధరలతో పోల్చుకుంటే గ్యాస్ రూ.450 నుంచి రూ.12 వందలకు, డీజిల్, పెట్రోల్ ధరలు రూ.50 నుంచి రు.110, వంటనూనె రూ. 200 వరకు పెరిగిందని, అభివృద్ధి అంటే ఇదేనా అని ఎద్దేవా చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, రామాంజనేయులు, నబీరసూల్, నక్కి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ముగిసిన మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : స్థానిక మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. పట్టణాభివృద్ధికి సంబంధించి 13 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులు కౌన్సిలర్లు సమావేశంలో పాల్గొన్నారు.

విత్తనాల విక్రయాల నిలిపివేత



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

ప్యాపిలి: పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, ప్యాపిలి వ్యవసాయాధికారి షేక్షావలితో కలసి రైతు మిత్ర ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రూ.1,59,750 విలువ విత్తనాల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దుకాణం యజమాని సంబంధిత రికార్డులు సక్రమంగా నిర్వహించిన తర్వాతనే విత్తనాల విక్రయాలకు అనుమతి ఇస్తామన్నారు. ఫర్టిలైజర్స్ దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విత్తనాలు, ఎరువులు విక్రయించరాదన్నారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు.